# నిజమైన ఆస్తి

**-జి.సరస్వతి**



"నిన్ను కొట్టిందెవరు సాకేత్?'' అనంతరావు అడిగిన ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పలేక తల దించుకున్నాడు సాకేత్.

సాకేత్ నెలరోజులక్రితం ఒకనాటి రాత్రి ఆఫీసు నుంచి వస్తూ ఉండగా నలుగురు రౌడీలు అటకాయించి స్పృహ పోయేదాకా కొట్టారు.

పూర్తిగా తెల్లవారకముందే పాలకోసం ఆ దారి వెంట వెళ్తున్న వృద్ధ దంపతులు అనందరావు, వరలక్ష్మి ధైర్యం చేసి మానవతా దృష్టితో దగ్గర్లో వున్న నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు.

సాకేత్ ఆస్పత్రిలో వున్న నెలరోజులు వరలక్ష్మి, అనంతరావులు అతనికి అవసరమైన సదుపాయాలన్నీ చేసారు. డిశ్చార్జి అయ్యాక సాకేత్ ఇంటికి వెళ్తానన్నాడు. మరో రెండువారాలపాటు తమతో ఉండి రెస్టు తీసుకోమని అనంతరావు చెప్పడంతో కాదనలేక వాళ్లింటికి వచ్చాడు సాకేత్.

"నీ వేలికున్న వజ్రపుటుంగరం, రిస్ట్‌వాచ్, పర్సు వాళ్ళు తాకనేలేదు. దాన్నిబట్టి చూస్తే వాళ్ళు నీ వస్తువులకోసం నిన్ను కొట్టలేదని, కిరాయికి కుదిరిన రౌడీలని అర్థమవుతోంది. నీకెవరైనా విరోధులు ఉన్నారా బాబూ'' అడిగాడు అనంతరావు.

"నా తోబుట్టువులే నాకు విరోధులయ్యారు అంకుల్'' అన్నాడు సాకేత్.

నివ్వెరపోయింది వరలక్ష్మి.

"ఎందుకంత ఆశ్చర్యం వరం? ఆస్తి పంపకాల్లో వచ్చే గొడవలు ఎంతటి దారుణాన్నైనా చేయిస్తాయి'' అన్నాడు అనంతరావు.

"మీకు చాలా ఆస్తిపాస్తులున్నాయా సాకేత్?'' అని అడిగింది వరలక్ష్మి.

"అవును ఆంటీ. మా నాన్నగారు చార్టర్డ్ అకౌంటెంట్. బాగా సంపాదిస్తూ ఆస్తుల్ని పెంచారు. మా అన్నలు, అక్క మా పెద్దమ్మ పిల్లలు. ఆవిడ పోయాక మా నాన్నగారు మా అమ్మను రెండో పెళ్లి చేసుకున్నారు. నా ఇద్దరన్నలు, అక్క మా అమ్మను లక్ష్యపెట్టేవారు కాదు. ఏదైనా మంచి మాట మా అమ్మ చెప్పబోతే కష్టాలు పెడుతున్నదని యాగీ చేసేవారు. తల్లిలేని పిల్లల్ని ఏమీ అనవద్దని మా నాన్నగారు మా అమ్మనే కోప్పడేవారు. ముగ్గురూ అతి కష్టంమీద డిగ్రీలు అయిందనిపించారు. మా నాన్నగారు తనకున్న పలుకుబడితో అన్నలకు ఉద్యోగాలు వేయించి పెళ్లిళ్ళు చేసారు. అక్కకు బాగా కలిగినింటి సంబంధం చేసారు. ముగ్గురికీ బాగా నగానట్రా పెట్టి తలోక ఇల్లు కట్టించి ఇచ్చారు. వాళ్ళకు ఇద్దరేసి పిల్లలు. వాళ్ళ పేర్న తలోక లక్ష రూపాయలు డిపాజిట్టు చేసారు. నేను కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివాను. రెండేళ్ళపాటు అమెరికాలో వుండి పిజి చేసి ఇండియాకు వచ్చి ఉద్యోగంలో చేరాను. అప్పటికి మా నాన్నగారికి వయసు బాగా మళ్లిపోయింది. చాలా డబ్బు ఖర్చుపెట్టి హార్ట్ ఆపరేషన్ చేయించవలసి వచ్చింది.

కానీ ఫలితం లేకపోయింది. మా నాన్నగారు పోయిన కొద్దిరోజులకే మా అమ్మ కూడా చనిపోయింది.

చదువుకి మా నాన్నగారు వాళ్లకిచ్చిన ఆస్తుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టారని, అందుచేత నేనుంటున్న ఇల్లు వాళ్లకే చెందాలంటూ అన్నలు, అక్క, బావ వచ్చి గొడవ చేయడం మొదలుపెట్టారు. వాళ్ల మాటల్లో నిజం లేదని, నేను ఇంటిని వదలనని ఖచ్చితంగా చెప్పాను. నా అంతు చూస్తామంటూ బెదిరించి వెళ్లిపోయారు. కోపం మీద అలా అన్నా వాళ్ళు నాకు హాని చేయరని అనుకున్నాను. కానీ రౌడీల చేతుల్లో దెబ్బలు తింటున్నప్పుడు వాళ్ళు నిజంగానే నా అంతు చూడదల్చుకున్నారని అర్థమైంది'' అన్నాడు సాకేత్.

"ఇంటిని మీవాళ్లకిచ్చేస్తావా సాకేత్?'' అని అడిగాడు అనంతరావు.

"నాకు న్యాయంగా వచ్చిన ఇంటిని నేనెందుకు వదులుకోవాలి అంకుల్?'' అన్నాడు సాకేత్.

"నువ్వు క్షేమంగా ఉండాలన్నా, మీవాళ్ళు గౌరవంగా బ్రతకాలన్నా ఇంటిది వదులుకోక తప్పదు సాకేత్'' అన్నాడు అనంతరావు. సాకేత్ మాట్లాడలేదు.

"నువ్వు బ్రతికే వున్నావన్న సంగతి వాళ్ళకు ఇవ్వాళ కాకపోయినా రేపైనా తెలుస్తుంది. నీ అంతు చూసేవరకూ వాళ్ళు నిద్రపోరు. నేరం బైట పడక మానదు. శిక్ష తప్పించుకోవడానికి పోలీసు స్టేషన్ చుట్టూ, కోర్టుల చుట్టూ వాళ్ళ ఆస్తుల్ని కరగబెట్టుకుంటూ తిరిగినా లాభం లేకపోవచ్చు. నేరం రుజువై జైలు పాలయ్యారనుకో. ఏం పాపం ఎరుగని వాళ్ల పిల్లలు అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాళ్ల చదువులు దెబ్బతింటాయి. సరైన సంబంధాలు రావు. వాళ్ళ బ్రతుకులు బలైపోతాయి. ఇల్లు కొన్ని లక్షల విలువ చేస్తుంది కానీ మీ నాన్నగారు నీకు చెప్పించిన చదువు విలువ కట్టలేనిది.

దాన్ని నీ నుంచి ఎవరూ లాక్కోలేరు. నీ చదువుతో మంచి ఉద్యోగం తెచ్చుకున్నావు. కష్టపడి పని చేస్తే ఉన్నత స్థితికి వెళ్తావు. నీ తోబుట్టువులు అత్యాశతో ముందు వెనుకలు ఆలోచించకుండా దారుణానికి పాల్పడ్డారు. కానీ నువ్వు విచక్షణాజ్ఞానంతో అందరి బాగు కోరి ఇంటిని వాళ్లకే ఇచ్చేసి నిశ్చింతగా బ్రతుకు సాకేత్'' అన్నాడు అనంతరావు ముగింపుగా.

***

"ఇంటి కోసం నాతో గొడవ పడడం మీకు మంచిదికాదు. అందుకే ఇంటిని మీకే ఇచ్చేస్తున్నాను. వాటాలకోసం మీలో మీరు పోట్లాడుకుని కక్షలు పెంచుకోకండి. ఇంటి డాక్యుమెంట్లు తీసుకోండి. మీరెప్పుడు రమ్మంటే అప్పుడు అడ్వకేట్ దగ్గరకు వచ్చి సంతకం పెడతాను. ఇకమీదట నా జోలికి రాకండి. నా బ్రతుకు నన్ను బ్రతకనివ్వండి'' కాగితాలు పెద్దన్న చేతిలో పెట్టాడు సాకేత్.

చావు దెబ్బలు కొట్టించినా ప్రాణాలతో బైటపడి తాము తలపెట్టిన దారుణం తమ బ్రతుకుల్ని ఎంతగా దెబ్బతీస్తుందో తెలియజెప్పి తమ మేలు కోరి ఇంటిని తమకే ఇచ్చేసి తన సామాను పట్టుకుని వెళ్లిపోతున్న సాకేత్‌వైపు నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయారు అతని తోబుట్టువులు. ★